క్లుప్తంగా

హెల్మెట్‌తోనే రక్షణ



కరపత్రాలు విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

కడప ఎడ్యుకేషన్ : ద్విచక్ర వాహనాలు నడిపే యువతకు హెల్మెట్‌తోనే రక్షణ అని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు అన్నారు. ఆర్ఆర్ రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ముద్రించిన హెల్మెట్ ధరించండి అనే ప్రచార కరపత్రాలను ఆదివారం యూటీఎఫ్ కార్యాలయంలో పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం వల్ల ప్రమాదాలకు దూరంగా ఉండవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ రాయల్ కరిముల్లా, యూటీఎఫ్ నాయకులు నరసింహారావు, బాబు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో సందడి



చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్ : కడప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. అఖిల్ డ్యాన్స్ అకాడమి విద్యార్థులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారి నృత్యాలకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభించింది. కార్యక్రమాల పాలనాధికారి టి.శివప్రసాద్‌రెడ్డి పర్యవేక్షించారు.

ప్రభువు మార్గం అనుసరించడమే ధ్యేయం



క్రైస్తవ గురువును సత్కరిస్తున్న సొసైటీ ప్రతినిధులు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు చూపిన శాంతి సమాధానాల బాటను అనుసరించడమే ధ్యేయమని సెయింట్ జాన్ చర్చి మాసాపేట విచారణ గురువులు గుడిమే దేవ సహాయం అన్నారు. ఆయన కడప నగరం మాసాపేట సెయింట్ జాన్ చర్చి నుంచి చిత్తూరు జిల్లా నగిరికి బదిలీ అయిన సందర్భంగా ఆదివారం శాంతి సేవా సొసైటీ వ్యవస్థాపకులు మడగలం ప్రసాద్ బృందం కలిసి సత్కరించి జ్ఞాపికను అందజేశారు. అలాగే నూతన గురువు సిప్రియన్‌ను సత్కరించి సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో మనోహర్, అమృత, నీలమ్మ, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనాలు ఇవ్వాలి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా వ్యాప్తంగా స్వచ్ఛ భారత్, గ్రామ పంచాయతీ కార్మికులకు నెలల తరబడి పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి మనోహర్, గ్రామ పంచాయతీ వర్కర్స్ జిల్లా కన్వీనర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు పెండింగ్‌లో పెట్టడం అన్యాయని ఆయన పేర్కొన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని నెలకొల్పే కార్మికులకు వేతనాలు రాకపోవడం వల్ల ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

శాకంబరి అలంకారంలో వరాల సుంకులమ్మ

కమలాపురం : పట్టణ పరిధిలోని చెరువు కట్టపై వెలసిన వరాల (వజ్రాల) సుంకులమ్మ శాకంబరి అలంకారంలో దర్శనమిచ్చి భక్తులను కనువిందు చేశారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారిని కూరగాయలు ప్రత్యేకంగా అలంకారంలో అలంకరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచి పెట్టారు.

అమ్మవారికి విశేష పూజలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని బొగ్గలేటిపల్లి కొత్తపేట సమీపంలోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కార్యనిర్వహణ అధికారి పి.సురేష్‌కుమార్ రెడ్డి ఏర్పాట్లను చేశారు. భక్తులు ఆలయ ఆవరణలో విందు భోజనాలను చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బోగాదమ్మకు వెండి కిరీటం బహూకరణ

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల కోరుకొండపై వెలసిన బోగాదమ్మతల్లికి సింహాద్రిపురం మండలం కోరవకుంటపల్లె గ్రామానికి చెందిన కొండ్రెడ్డి లక్ష్మినారాయణ రెడ్డి దంపతులు వెండి కిరీటం బహూకరించారు. ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు వారు అందజేశారు. ఆలయ అర్చకులు అమ్మవారికి అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు.

హై 'టెన్షన్'

- ప్రాణాలతో చెలగాట మాడుతున్న విద్యుత్ శాఖ
- నివాస గృహాలకు ఆనుకొని విద్యుత్ లైన్ల ఏర్పాటు



సంజన్న సర్కిల్‌లో తక్కువ ఎత్తులో ఉన్న హైటెన్షన్ వైర్లు



సాయి నగర్ కాలనీలో ఇళ్లకు అతి సమీపంలో ఉన్న విద్యుత్ లైన్లు

కడప కార్పొరేషన్ : కడప నగరం బుద్ధాయపల్లె సచివాలయ పరిధిలోని సాయి నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన హై టెన్షన్ వైర్లతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. రెండు వీధుల మధ్య గల రహదారి మార్గంలో మధ్యలో కరెంటు పోల్స్ నాటి, ఇళ్లకు అతి సమీపంలో లైన్లు లాగడంతో స్థానిక ప్రజలు విద్యుత్ ప్రమాదాలు జరుగుతాయేమోనని ఆందోళన చెందుతున్నారు. మిద్దెపైకి ఎక్కి బాల్కనీలో నిల్చొంటే చేయి పెట్టినా అందే విధంగా లైన్లు ఉన్నాయి. ఈ వీధిలో సుమారు 20 ఇళ్ల వరకూ ఉన్నాయి. అసలే ఆ వీధి కూడా చాలా ఇరుకుగా ఉంది. ఇందులో పోల్స్ నాటి లైన్లు లాగడం వల్ల మరింత ఇరుకుగా మారింది. చెట్లు కూడా ఏపుగా పెరిగి ఉన్నాయి. విద్యుత్ లైన్లు కూడా వాటికి అతి సమీపంలో ఉండటం గమనార్హం. నివాస ప్రాంతాల్లో హై టెన్షన్ వైర్లను తొలగించి ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సంజన్న సర్కిల్‌లో..

చిన్నచౌకులోని మినీ బైపాస్ వద్దనున్న సంజన్న సర్కిల్‌లో కూడా హై టెన్షన్ వైర్లు తక్కువ ఎత్తులో ఉన్నాయి. భారీ వాహనాలు పోయేటప్పుడు ఈ హైటెన్షన్ వైర్ల వల్ల ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది. కొన్ని ఏళ్ల క్రితం వేసిన లైన్లు కావడం వల్ల అప్పుడు ఎత్తులో ఉండవచ్చమోగానీ, ఇప్పుడు తక్కువ ఎత్తులో కనిపిస్తున్నాయి. వీటిని ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేస్తే భవిష్యత్‌లో ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఆస్కారం ఉంటుంది.

వెలగని వీధి లైట్లు.. ప్రజలకు ఇక్కట్లు



అంధకారంలో ఉన్న వీధి



వాహన వెలుతురులో కనిపిస్తున్న వీధి

కడప ఎడ్యుకేషన్ : కడప ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న పటేల్ రోడ్డులోని చిట్టచివరి వీధిలో ఆదివారం రాత్రి వీధిలైట్లు వెలగక స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వీధిలో ఏర్పాటు చేసిన వీధిలైట్లకు సంబంధించిన స్విచ్ కంట్రోల్ సరిగా పని చేయని కారణంగా వీధిలైట్లు వెలగకుండా పోయామని స్థానికులు తెలిపారు. ఈ పరిస్థితి ఇప్పుడే కాదని ఎప్పుడు పడితే అప్పుడు లైట్లు వెలగడం లేదని స్థానికులు చెప్పారు. వీధి లైట్లు వెలగనప్పుడు పూర్తి అంధకారం నెలకుంటుందని, దీంతో ఆ రోడ్డు వెంట వెళ్లేవాళ్లు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వాపోయారు. దీనికి తోడు రోడ్డుపై ఏర్పాటు చేసిన మ్యాన్‌హోల్స్‌లో ఒకటి రెండు చోట్ల మూతలు సరిగా లేవని చీకట్లో అందులో కాళ్లు పడితే కింద పడే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి కొత్త స్విచ్ కంట్రోల్ ఏర్పాటు చేయాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి



నబీకోటలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా



హౌసింగ్ బోర్డు కాలనీలో గ్రామోత్సవం



భక్తుల కోలాటం

కడప కల్చరల్ : గురుపౌర్ణమిని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వ్యాస మహర్షి జయంతిని ఆషాఢ పౌర్ణమి నాడు గురుపౌర్ణమిగా నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఈ సందర్భంగా దాదాపు అన్ని సాయిబాబా మందిరాలు, దత్తాత్రేయస్వామి ఆలయాలతోపాటు దాదాపు అన్ని వైష్ణవ దేవాలయాల్లో కూడా విశేష పూజలు నిర్వహించారు. ప్రత్యేకించి ప్రతి దేవాలయంలోనూ మూలమూర్తికి స్నపన తిరుమంజనం, ఆరాధన, సుదర్శన మూలగాయత్రి హోమం, నవకలశ స్నపనం, సహస్ర నామార్చాన, ధూప దీప నైవేద్య సమర్పణ చేశారు. మున్సిపల్ స్టేడియం వద్ద గల సాయిబాబా, దత్తాత్రేయస్వామి ఆలయాలు, మున్సిపల్ మైదానం, కో ఆపరేటివ్ కాలనీ, రామకృష్ణనగర్, ప్రతాప్ పబ్లిక్ స్కూలు వద్ద గల సాయిబాబా మందిరాలు, అల్మాస్‌పేట సర్కిల్‌తోపాటు పలు వీధుల్లోని సాయిబాబా మందిరాలలో మూల మూర్తులకు విశేష అభిషేకాలు చేశారు.

- హౌసింగ్‌బోర్డు కాలనీ శ్రీ కోదండ రామాలయంలోని సాయిబాబాకు భక్తులు విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామిని ప్రత్యేకమైన పల్లకీలో కొలువుదీర్చి మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. మహిళా భక్తుల కోలాటాల సందడి, మేళతాళాలు, మంగళ వాయిద్యాల సుస్వరనాదాల మధ్య గ్రామోత్సవం ఘనంగా సాగింది.
- విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పాత బస్టాండులోని సంస్థ కార్యాలయంలో వ్యాస మహర్షి చిత్రపటం వద్ద పుష్పాంజలి ఆచరించారు. శ్రీ లలితా పీఠం అధిపతి స్వామి తురియానంద సరస్వతికి పాదపూజ నిర్వహించి ఘనంగా సత్కరించి పూలు, పండ్లు అందజేశారు. ఆయన అభిభాషణ అనంతరం భక్తులందరికీ ఆశీస్సులు అందజేశారు. వీరితోపాటు శ్రీరామకృష్ణమఠం పీఠాధిపతి శ్రీ అనుపమానంద స్వామిజీ, అమ్మాయమ్మ పీఠాధిపతి స ప్రేమానందలను కూడా భక్తులు కలిసి ఆశీస్సులు పొందారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రాంత ధర్మాచార్య సంపర్క్ ప్రముఖ్ బి.రామమహేష్, ఇతర ప్రతినిధులు మనోహర్‌రెడ్డి, నగర కార్యదర్శి సురేంద్ర, సహ కార్యదర్శి సంజీవరాజు, ఉపాధ్యక్షులు అమర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- పుష్పగిరి క్షేత్ర తీర్థ అభివృద్ధి సంస్థ ప్రతినిధి, న్యాయవాది సట్టి భారవి బృందం నగరంలో శోభాయాత్ర నిర్వహించారు. అన్నమాచార్యుల వారసులైన శ్రీ తాళ్లపాక స్వామి దంపతులకు పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.
- స్థానిక మున్సిపల్ మైదానంలోని శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయంలో విశేష పూజలు, మహానైవేద్యం నిర్వహించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్ నగర ఆలయాల్లో జరిగిన పూజోత్సవాలను పర్యవేక్షించారు.
- గడ్డిబజారులోని శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. శ్రీ సత్యనారాయణస్వామి, అమ్మవారి మూల, ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో భక్తులతో సామూహికంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహింపజేశారు.
- ప్రముఖ యోగా గురువు అయ్యవారురెడ్డిని శిష్యులు ఘనంగా సత్కరించారు. ఆయన కడప నగరం చిన్నచౌకులోని జెడ్పీ బాలికల హైస్కూలులో ఉచితంగా వేలాది మందికి యోగా నేర్పుతున్నారు.
- స్థానిక ఆర్కేనగర్‌లోని శ్రీ సాయి శనీశ్వర ఆలయంలో అర్చకులు శ్రీధరశర్మ ఆధ్వర్యంలో పూజోత్సవాలు నిర్వహించారు.

కడప అర్బన్ : కడప నగరంలోని నబీకోటలో శ్రీ షిర్డీ సాయిబాబా ఉత్సవ విగ్రహాన్ని పల్లకీ సేవలో ఊరేగింపు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు గోదిన కృష్ణమూర్తి, సతీమణి ప్రమీలమ్మ, అర్చకులు రవిస్వామి, వలంటీర్లు నరేష్, విజయ, చైతన్య, నితీష్, రవి, సుబ్రమణ్యం పాల్గొన్నారు.

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నగరంలోని 45వ డివిజన్ ఊటుకూరు గ్రామంలోని శుభసాయి మందిరంలో సాయిబాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రి స్వామి వారికి పల్లకీ సేవ చేశారు.

డిపార్ట్‌మెంటల్ పరీక్షపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ సీవీ ప్రసాద్

కడప ఎడ్యుకేషన్ : ఉద్యోగ, ఉపాధ్యాయులు డిపార్ట్‌మెంటల్ పరీక్ష ఉత్తీర్ణత కోసం రూల్స్‌పై అవగాహన పెంచుకోవాలని జేఏసీ జిల్లా చైర్మన్ శ్రీనివాసులు, ఏపీ ఎన్జీవో జిల్లా కార్యదర్శి రవికుమార్ అన్నారు. కడపలోని ఎన్జీవో భవనంలో ఆదివారం ఏపీటీఎఫ్ అమరావతి ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంటల్ పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదస్సులోని సూచనలు పాటించి ప్రతి ఉద్యోగి డిపార్ట్‌మెంటల్ పరీక్షలో ఉత్తీర్ణులై ముందుకు సాగాలని కోరారు. ఏపీటీఎఫ్ అమరావతి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీలు సీవీ ప్రసాద్, చంగల్‌రెడ్డి మాట్లాడుతూ కంప్యూటర్ ద్వారా పరీక్షలు రాయుటకు కావాల్సిన అవగాహన కోసం కరదీపిక కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ అమరావతి కడప జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి ఆలీఖాన్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ అమరావతి బిట్స్ బుక్‌లెట్లలో సక్సెస్ రేటు 75 శాతం మేర ఉంటుందని తెలిపారు. ప్రముఖ విద్యా విశ్లేషకులు రెహమాన్, రాధాకృష్ణ మాట్లాడుతూ సర్వీసులో ఎదురయ్యే నిబంధనలు, సమస్యలను పరిష్కరించే విధంగా అనుమానాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు ఉమాకాంత్, ఈశ్వరచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డితోపాటు ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థిని గాయపరచడం తగదు



నవదీప్‌ను పరామర్శిస్తున్న మానవ హక్కుల నాయకులు

కడప రూరల్ : వాహనాల తనిఖీలో భాగంగా ఈ నెల 20వ తేదీన కడప నగరంలో విద్యార్థి నవదీప్‌ను పోలీసులు గాయపరచడం దారుణమని ఆంధ్రప్రదేశ్ స్టాండింగ్ కమిటీ మానవ హక్కుల విభాగం నాయకుడు సుంకేసుల బాదుల్లా అన్నారు. కడప రిమ్స్‌లో చికిత్స పొందుతున్న నవదీప్‌ను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం మాట్లాడుతూ వాహనాల తనిఖీని చూసి నవదీప్ భయభ్రాంతులకు గురై వెనుతిరిగి వెళ్తుండగా, పోలీసులు వెంబడించి పట్టుకొని గాయపరచడం తగదని తెలిపారు. ఈ అంశాన్ని హ్యూమన్ రైట్స్ కమిషన్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పాలగిరి శివ, ప్రధాన కార్యదర్శి ఆర్.సిద్దయ్య, ఎంబీసీ ఉపాధ్యక్షులు శివయ్య తదితరులు పాల్గొన్నారు.

విచారణ జరిపించాలి

కడప ఎడ్యుకేషన్: వైవీయూ, ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయాల్లోని అవినీతిపై విచారణ జరిపించాలని పీడీఎస్‌యూ అంకన్న కోరారు.

శాస్త్రీయ దృక్పథంపై ఆసక్తి కల్పించాలి





మ్యాజిక్ అంశాలను ప్రదర్శిస్తున్న జేవీవీ ప్రతినిధులు, కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు, మేధావులు

కడప కల్చరల్ : మహిళల్లో శాస్త్రీయ దృక్పథం పట్ల ఆసక్తి కల్పించాలని బయో టెక్నాలజీ అధ్యాపకులు డాక్టర్ పి.కల్పన అన్నారు. ఆదివారం జన విజ్ఞాన వేదిక సమత విభాగం ఆధ్వర్యంలో ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో ఆమె దాదాపు 200 మంది మహిళలతో సదస్సు నిర్వహించారు. మహిళల్లో మూఢ నమ్మకాలు ప్రధానపాత్ర పోషిస్తాయని, వారు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉంటే పిల్లల్లో కూడా అదే ఆలోచన ఉంటుందన్నారు. కుటుంబం ఇలా చైతన్యవంతమైతే గౌరవప్రదమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా ఆమె మహిళల్లో లోపించిన శాస్త్రీయ దృక్పథం గురించి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. సమాజంలో ప్రధాన పాత్ర పోషించే మహిళలు వ్యక్తిగత, కుటుంబ పరమైన సమస్యలతో అనారోగ్యపాలవడం, బాల్య దశ నుంచే మూఢత్వం సమస్యగా బాధపడుతున్న మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి డాక్టర్ ప్రమోద వివరించారు. ప్రొఫెసర్ సునీత మాట్లాడుతూ దైనందిన జీవితంలో మూఢ నమ్మకాల పట్ల జాగ్రత్తలు పాటించాలన్నారు. సైకియాట్రిస్ట్ సునీత మాట్లాడుతూ మహిళల్లో మానసిక సమస్యలకు వెనుకగల అంశాలను తెలియజేశారు. అనంతరం సంస్థ సభ్యులు బాల బయన్న, వెంకటేశ్వర్లు తమ మ్యాజిక్ ద్వారా మంత్ర తంత్రాల పేరిట సమాజంలో జరిగే మోసాల గురించి తెలియజేశారు. పలువురు పిల్లలు, మహిళలతో మ్యాజిక్ అంశాలు చేయించారు. ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వీర సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజానికి వెన్నముకలా మహిళలు ముఖ్యపాత్ర పోషిస్తుండడం గమనించాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ సమత మహిళా విభాగాల సభ్యులు, ఉపాధ్యాయులు, మేధావులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మురుగు.. సమస్య ఎప్పుడు తొలగు



ఆర్టీసీ బస్టాండు ఆవరణలో నిలిచిన మురుగునీరు


కడప కార్పొరేషన్ : ఇది ఎక్కడో మారుమూల ప్రదేశమో... మురికివాడో కాదు... కడప నగర నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండులోనిది. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితమే దీన్ని ఎవరూ కాదనలేరు.. కానీ కడప ఆర్టీసీ బస్టాండులో పరిసరాలు అంత సురక్షితం కాదని ప్రయాణికులు పేర్కొంటున్నారు. అంబేడ్కర్ సర్కిల్ నుంచి ఆర్టీసీ బస్టాండులోపలికి వెళ్లే మార్గం పెద్ద ఎత్తున మురుగునీటితో నిండిపోయింది. దాని పక్కనే స్కూటర్ స్టాండు ఉంది. ఇందులోకి కూడా మురుగునీరు చొచ్చుకువస్తున్నాయి. చాలా రోజులు నిల్వ ఉండటం వల్ల ఆకుపచ్చని వర్ణంలో ముక్కుపుటాలదిరేలా దుర్గంధం వస్తోంది. ఇందులో ఈగలు, దోమలు, పురుగులు వ్యాప్తి చెందుతుండటంతో ఆ చుట్టూ ఉన్న పరిసరాలు తీవ్ర అపరిశుభ్ర వాతావరణంలో ఉన్నాయి. ఈ దోమలు కాటేస్తే రోగాలు రాక తప్పదని ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. ఇలా నీటితో నిండినప్పుడల్లా నగరపాలక సిబ్బంది సెప్టిక్ ట్యాంకులతో తోడేయాల్సి వస్తుందే తప్ప శాశ్వత పరిష్కారం లభించడం లేదు. నగరపాలక, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా దీని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఊరిస్తూ.. ఉసూరుమంటూ..



గత నాలుగు రోజుల నుంచి జిల్లాలో ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుంటూ కర్షకులను ఊరిస్తూ అంతలోనే ఉసూరుమంటున్నాయి. ఈ నాలుగు రోజుల్లో జిల్లాలో అక్కడక్కడా తప్పితే చాలా చోట్ల సరైన వర్షాలు మాత్రం కురవలేదు. ఆదివారం సాయంత్రం కడపలో ఆకాశమంతా వెండి కొండలతో నిండి కారు మబ్బులు కమ్మి ఊరించి కొద్దిసేపు చిరుజల్లులు కురిశాయి. అంతలోనే తెరపిచ్చి వర్షం పడకుండానే దాటుకుంది. దీంతో చివరికి జనాలకు ఉక్కపోతే మిగిలింది. - కడప అగ్రికల్చర్

విజయదుర్గమ్మకు పౌర్ణమి కలశ పూజ





విశేష అలంకారంలో శ్రీ విజయదుర్గమ్మ, కలశ ధారణతో ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

కడప కల్చరల్ : కడప నగరంలోని శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో ఆదివారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక కలశ పూజ నిర్వహించారు. 45 రోజులపాటు అమ్మవారి సన్నిధిలో పవిత్ర జలాలతో నింపిన ఈ కలశాన్ని నిత్య పూజలతో ఆరాధించారు. ఆషాఢ పౌర్ణమిని పురస్కరించుకుని ఆ కలశాలను ఆలయ వ్యవస్థాపకుడు సుధా మల్లికార్జునరావు, నిర్వాహకుడు దుర్గాప్రసాద్ కుటుంబ సభ్యులు, భక్తులు కలశంలోని జలాలతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించి అనంతరం మూలమూర్తికి అభిషేకం చేశారు. ఈ సందర్భంగా యాగశాలలో గణపతి, విజయదుర్గ, చండీ హోమాలు నిర్వహించారు. అమ్మవారి భక్తులు హోమంలో సమిధలు సమర్పించి దీక్ష విరమణ చేశారు. సాయంత్రం 108 మంది ముత్తయిదువులు దీపాలు వెలిగించి అష్టోత్తర దీపాలంకార సేవ చేశారు. కార్యక్రమంలో రాయపెద్ది సుబ్బరామశర్మ, పండితులు పాల్గొన్నారు.

ఉక్కు పరిశ్రమతో ఉపాధి కల్పన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే బడ్జెట్ సమావేశాల్లో ఈసారైనా కడప ఉక్కు పరిశ్రమకు నిధులు కేటాయించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్ర విభజన హామీ అయిన కడప ఉక్కును గత పదేళ్లుగా కేంద్రం పూర్తిగా విస్మరించింది అన్నారు. కరువు, వలసలతో అల్లాడుతున్న రాయలసీమ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పన రావాలంటే ఉక్కు పరిశ్రమ ఏకైక మార్గం అన్నారు. పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పుడు కేంద్రంలో టీడీపీ కూడా కీలకంగా ఉంది కనుక నిధులు రాబట్టాలన్నారు.